క్లుప్తంగా

జూలై నాటికి భూహక్కు పత్రాల పంపిణీ



సర్వే డ్రోన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ రామ్‌కుమార్

మండపేట: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష సర్వే పట్టణంలో వేగంగా జరుగుతోందని, భూహక్కు పత్రాల పంపిణీని జూలై నాటికి పూర్తి చేస్తామని మండపేట మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్ అన్నారు. పట్టణంలో వార్డు సచివాలయ ప్లానింగ్ సిబ్బందికి శనివారం డ్రోన్ సర్వే గురించి సార్ ఐటీ ఏజెన్సీ ప్రతినిధులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ రామ్‌కుమార్ మాట్లాడుతూ డ్రోన్, కార్స్ నెట్వర్క్, రోవర్ తదితర ఆధునిక పరికరాల ద్వారా ప్రతి స్థిరాస్తినీ అత్యంత కచ్చితంగా భూఅక్షాంశ, రేఖాంశాలతో గుర్తించి కొత్త సర్వే, రెవెన్యూ రికార్డులను తయారు చేస్తున్నామన్నారు.

కోడి పందేలు, పేకాటల జోలికి పోవొద్దు

రామచంద్రపురం రూరల్: సంక్రాంతి పురస్కరించుకుని గ్రామ ప్రజలు కోడి పందేలు, పేకాట, గుండాట వంటి అసాంఘిక కార్యక్రమాల జోలికి పోవొద్దని హసన్‌బాద గ్రామ సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు ప్రజలను కోరారు. గ్రామంలో శనివారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ గతేడాది కోడి పందేలు వంటి అసాంఘిక కార్యక్రమాలను నియోజకవర్గంలో నిరోధించి సంక్రాంతి సంబరాలు నిర్వహించారన్నారు. ఆయన బాటలోనే గ్రామంలో ఆదివారం సంక్రాంతి సంబరాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ సూర్య కుమారి, గ్రామస్తులు పాల్గొన్నారు.

సేవాభావంతో ప్రజల మనసుల్లో స్థానం



రాయవరంలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఫణికృష్ణారెడ్డి

రాయవరం: సేవాభావంతో ప్రజల హృదయాల్లో స్థానాన్ని పదిల పరచుకోవాలని సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ, తూర్పుగోదావరి జిల్లా బ్లడ్ అండ్ ఐ డోనర్స్ క్లబ్ చైర్మన్ వెలగల ఫణికృష్ణారెడ్డి పేర్కొన్నారు. స్థానిక దళితపేటలో యువ చైతన్య యూత్ ఆధ్వర్యంలో యూత్ క్రిస్మస్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో రామకృష్ణ, ఫణికృష్ణారెడ్డిలు మాట్లాడుతూ పేద కుటుంబాలకు చెందిన చైతన్య యూత్ సభ్యులు కష్టార్జితాన్ని చందాలుగా వేసుకుని, పేదలకు సాయం చేయడాన్ని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. అనంతరం 120 మంది పేదలకు దుప్పట్లు పంపిణీ, అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు లంక చందు, క్రీస్తు సంఘ సేవకులు లంక రాజు, మచ్చా లాజర్, టి.నతానియేల్ తదితరులు పాల్గొన్నారు.

కోలాహలంగా ముగ్గుల పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న చైర్‌పర్సన్ శ్రీదేవి, మంత్రి సతీమణి వరలక్ష్మి

రామచంద్రపురం: పాన్ షాప్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సిరిగినీడి దుర్గాప్రసాద్, పడాల సూరిబాబు, కోకోకోలా సంయుక్త ఆధ్వర్యంలో కృత్తివెంటి పేర్రాజు పంతులు విద్యా సంస్థల ప్రాంగణంలో శనివారం సంక్రాంతి ముగ్గుల పోటీలను కోలాహలంగా నిర్వహించారు.

జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వి.సోమశేఖర్‌రావు పర్యవేక్షణలో జరిగిన పోటీల్లో విజేతలకు మున్సిపల్ చైర్‌పర్సన్ గాధంశెట్టి శ్రీదేవి, మంత్రి వేణు సతీమణి వరలక్ష్మి చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పద్మజ, కౌన్సిలర్ వాడ్రేవు సాయిప్రసాద్, కంచుమర్తిబాబూరావు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడు అదృశ్యంపై కేసు

మండపేట: పట్టణానికి చెందిన వృద్ధుడి అదృశ్యంపై శనివారం రాత్రి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. స్థానిక తర్వాణీపేటకు చెందిన ఎల్.వీరభద్రరావు గతేడాది అక్టోబరు 14వ తేదీ నుంచి కనిపించడం లేదు. చుట్టుపక్కల, బంధువుల ఇళ్లు గాలించిన ఫలితం లేక పోవడంతో అతని భార్య సావిత్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆమెదే ఆధిక్యం



ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు(ఫైల్)

- మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లో 4,14,285 మంది ఓటర్లు
- ఓటర్లలో మహిళల సంఖ్యే మిన్న
- పురుషుల కంటే 5,305 మంది అధికం

రాయవరం: విద్య..వైద్యం..రాజకీయం.. ఇలా ఏ రంగంలోనైనా మహిళలదే పైచేయిగా ఉంటుంది. తాజాగా ఈ నెల 5న ప్రకటించిన ఓటర్ల జాబితాలోను అతివల ఆధిక్యం కొనసాగింది. రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లో మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. భవిష్యత్తులో జరగబోయే ఎన్నికల్లో వారి ఓటే కీలకం కానుంది.

ఓటరు జాబితా కీలకం

ఎన్నికల ప్రక్రియలో ఓటరు జాబితా ఎంతో కీలకంగా మారుతుంది. గతంలో ఓటరు జాబితా సవరణ ఏడాదికొకసారి నిర్వహించి, తుది ఓటరు జాబితాను విడుదల చేసేవారు. అయితే ప్రస్తుతం ఏడాదిలో నాలుగు సార్లు ప్రత్యేక ఓటర్ల సంక్షిప్త సవరణ ప్రక్రియను నిర్వహించాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. జనవరి, ఏప్రిల్, జులై, అక్టోబర్ నెలల్లో ఏటా ఓటర్ల సంక్షిప్త సవరణ ప్రక్రియ నిర్వహించనున్నారు. గతంలో ఏడాదికి ఒక్కసారే 18 ఏళ్లు నిండిన వారికి ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉండేది. ఇకపై ఏడాదిలో నాలుగుసార్లు జనవరి, ఏప్రిల్, జులై, అక్టోబర్ నెలల్లో ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశమేర్పడింది. అదే నెలల్లో ఓటర్ల సంక్షిప్త సవరణ కసరత్తును అధికారులు నిర్వహిస్తారు. 17 ఏళ్లు నిండిన వారు సైతం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేలా అవకాశం కల్పించారు. అయితే 18 సంవత్సరాలు నిండిన వెంటనే వారి ఓటు హక్కును బీఎల్‌లోలు ఆన్‌లైన్‌లో ఆమోదిస్తారు.

3,638 మంది చేరిక

ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం గతేడాది నవంబరు 9 నుంచి డిసెంబరు 8వ తేదీ వరకు ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం చేపట్టారు. అందులో భాగంగా రామచంద్రపురం నియోజకవర్గంలో 1,846, మండపేట నియోజకవర్గంలో 1,792 మంది నూతన ఓటర్లు చేరారు. అలాగే చనిపోయిన, వలసలు వెళ్లిన వారిలో మండపేట నియోజకవర్గం నుంచి 1,845, రామచంద్రపురం నియోజకవర్గం నుంచి 1,902 మంది ఓటర్లను తొలగించారు.

రెండునియోజకవర్గాల్లోను ఆమెదే ఆధిక్యం

ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ నెల 5న తుది ఓటర్ల జాబితాను విడుదల చేశారు. రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లో మహిళా ఓటర్ల ఆధిపత్యం కొనసాగుతుంది. మండపేట నియోజకవర్గంలో 5,021 మంది, రామచంద్రపురం నియోజకవర్గంలో 284 మంది మహిళా ఓటర్లు, పురుష ఓటర్ల కంటే అధికంగా ఉన్నారు. తాజాగా విడుదలైన ఓటర్ల జాబితాల ప్రకారం రామచంద్రపురం నియోజకవర్గంలో 1,99,495 మంది ఓటర్లు ఉండగా, వారిలో మహిళా ఓటర్లు 99,886 మంది ఉండగా, పురుష ఓటర్లు 99,602 మంది, ట్రాన్స్ జెండర్లు ఏడుగురు ఉన్నారు. మండపేట నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,14,790 మందిలో మహిళా ఓటర్లు 1,09,904 మంది ఉండగా, పురుష ఓటర్లు 1,04,883 మంది, ట్రాన్స్ జెండర్లు ముగ్గురు ఉన్నారు.

మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లో ఓటర్ల పరిస్థితి

మండలం	పురుషులు	స్త్రీలు	థర్డ్ జెండర్	మొత్తం
రాయవరం	25,905	26,869	01	52,775
మండపేట(అ)	22,199	24,590	01	46,790
మండపేట(రూ)	30,660	32,199	01	62,860
కపిలేశ్వరపురం	26,119	26,246	00	52,365
మొత్తం	1,04,883	1,09,904	03	2,14,790
ఆర్‌సీపీఎం(అ)	16,737	17,908	03	34,648
ఆర్‌సీపీఎం(రూ)	28,591	28,561	02	57,154
కాజులూరు	28,059	27,747	00	55,806
కె.గంగవరం	26,215	25,670	02	51,887
మొత్తం	99,602	99,886	07	1,99,495

ఓటరు జాబితా కీలకం



ఎన్నికల ప్రక్రియలో ఓటరు జాబితా కీలకమైంది. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఏటా ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం నిర్వహిస్తాం. ఎన్నికల సంఘం ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఓటర్ల జాబితా తుది జాబితా రూపొందించాం.

– కేజే ప్రకాష్‌బాబు, తహసీల్దార్, రాయవరం

జగనన్న పాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు



గొల్లపాలెంలో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తున్న బాబురావు

కాజులూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని వైఎస్సార్ సీపీ మండల ప్రధానకార్యదర్శి పోతురాజు బాబురావు అన్నారు. శనివారం మండలంలోని గొల్లపాలెం, మొగలిపాలెం తదితర గ్రామాలలో బాబురావు వలంటీర్లతో పాటు ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాదయాత్రలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పింఛన్ సొమ్ము క్రమంగా పెంచుతూ వెళతానని ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల సేవాదళ్ అధ్యక్షుడు టేకుమూడి దుర్గారావు, మాత మురళి తోట కృష్ణ, వడ్డి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పంట నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి

రాయవరం: పంట నమోదు ప్రక్రియను వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి కొప్పిశెట్టి ప్రభాకర్ సూచించారు. మండలంలోని లొల్ల రైతు భరోసా కేంద్రంలో శనివారం మండలంలోని వ్యవసాయ సహాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. వ్యవసాయ శాఖ అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాలపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో తొలుతగా వ్యవసాయ సహాయకుల రిజిస్టర్లను పరిశీలించారు. ప్రతి గ్రామంలో నిర్వహించే పొలంబడి నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పీఎం కిసాన్ పథకానికి అర్హత కలిగిన ప్రతి రైతుతో ఈకేవైసీని ఈ నెల 15వ తేదీలోగా చేయించాలన్నారు. గడువులోగా ఈకేవైసీ చేయించకుంటే పీఎం కిసాన్‌కు అనర్హులవుతారన్నారు.

ఎమ్మెల్సీ తోటను కలిసిన ఫెల్లోషిప్ నాయకులు



వెంకటాయపాలెంలో తోటను సత్కరిస్తున్న ఫెల్లోషిప్ నాయకులు

కపిలేశ్వరపురం: మండల పాస్టర్స్ ఫెల్లోషిప్ నాయకులు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులును వెంకటాయపాలెంలోని ఆయన నివాసంలో శనివారం కలిసి సత్కరించారు. ఫెల్లోషిప్ అధ్యక్షుడు జి.రూబెన్, ఉపాధ్యక్షుడు ఎం.డేవిడ్ రాజు, కోశాధికారి కె.ఇమ్మానుయేల్ తదితరులు తమ సంఘ కార్యకలాపాలను వివరించారు. సంఘ భవనం మెరుగుదలకు కృషి చేయాలని కోరారు. ఎమ్మెల్సీని కలిసిన వారిలో ఫెల్లోషిప్ నాయకులు నానిబాబు, డి.ప్రవీణ్, బి.ప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు శివకుమార్ పాల్గొన్నారు.

తణుకువాడలో ఘనంగా చండీహోమం

కాజులూరు: తణుకువాడ శ్రీరామాలయం ఆవరణలో శనివారం స్థానికులు చండీహోమం నిర్వహించారు. శలపాక, డేగలపేట, గొల్లపాలెం తదితర గ్రామాలకు చెందిన భజనబృందాలు ఏకాహంలో పాల్గొని భక్తి గీతాలు ఆలపించారు. పెద్ద ఎత్తున భక్తులు చండీహోమంలో పాల్గొన్నారు. అనంతరం అన్న సమారాధనలో స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. మాజీ సర్పంచ్ దెయ్యాల వెంకటరమణ, పితాని ఆదినారాయణ, దెయ్యాల సత్తిబాబు పాల్గొన్నారు.

ఘనంగా మహాలక్ష్మి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం

రామచంద్రపురం రూరల్: హసన్‌బాదలో వేంచేసి యున్న మహాలక్ష్మి అమ్మవారి ఆలయ 10వ వార్షికోత్సవం శనివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి అమ్మవారికి అభిషేకాలు, కుంకుమ పూజలు, హోమాలు నిర్వహించారు. శ్రీదేవీ భూదేవీ సమేత వెంకటేశ్వర స్వామి కల్యాణం జరిపించారు. సుమారు 3,500 మందికి అన్నప్రసాద వితరణ జరిగింది. గ్రామ సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు, ఎంపీ బోస్ తనయుడు పిల్లి సూర్యప్రకాశ్, ఉమారామలింగేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ ఎర్ర సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

సినీనటి అనసూయకు బాహుబలి కాజా



బాహుబలి కాజాతో అనసూయ

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): టీవీ యాంకర్, సినీనటి అనసూయ భరద్వాజ్‌కు శనివారం సురుచి పీఆర్వో వర్మ బాహుబలి కాజా అందించి సత్కరించారు. పెద్దాపురంలో షోరూమ్ ప్రారంభోత్సవానికి వచ్చిన ఆమెకు కాకినాడలోని ఒక హోటల్‌లో ఈ కాజా అందించినట్టు ఆయన వివరించారు. జిల్లాకు ప్రముఖులు ఎవరొచ్చినా బాహుబలి కాజా అందివ్వడం సురుచి సంప్రదాయమన్నారు.

ఎరుకుల సంక్షేమానికి కృషి చేస్తా

రాయవరం: ఎరుకుల సంక్షేమానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సింగం శ్రీను తెలిపారు. రాయవరంలో శనివారం రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా ఎంపికైన శ్రీనును ఎరుకుల సంక్షేమ సంఘం ఘనంగా సత్కరించింది.

పేదరిక నిర్మూలనకే నవరత్న పథకాలు



రామచంద్రపురం పట్టణంలో జరిగిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి వేణు

- మంత్రి చెల్లుబోయిన వేణు
- రామచంద్రపురంలో గడప గడపకూ మన ప్రభుత్వం

రామచంద్రపురం: తన పాదయాత్ర ద్వారా పేదల కష్టాలను తెలుసుకున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదరిక నిర్మూలనకు నవరత్న పథకాలను తీసుకొచ్చారని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. పట్టణంలోని 10వ సచివాలయం పరిధిలోని 22వ వార్డులో శనివారం జరిగిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి గత మూడున్నరేళ్లలో ప్రభుత్వం నుంచి ఆయా కుటుంబాలు పొందిన లబ్ధిని వివరించారు. స్థానిక ప్రజలు వివరించిన సమస్యలను సావధానంగా విని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్, అధికారులను ఆదేశించారు.

ప్రజాసమస్యల పరిష్కారం దిశగా : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజాసమస్యల పరిష్కారం దిశగా పనిచేస్తుందని మంత్రి చెల్లుబోయిన వేణు అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందుతున్నాయన్నారు. సంక్షేమ పథకాల అమలులో దేశంలో ఎక్కడా లేని విధంగా లబ్ధిదారుల ఖాతాలకు నేరుగా లబ్ధిని జమ చేస్తున్నామని వివరించారు. రైతుల కోసం రైతు భరోసా, పేదవారి వైద్యం కోసం ఆరోగ్యశ్రీ,, నాణ్యమైన చదువుల కోసం నాడు–నేడు ద్వారా పాఠశాలల ఆధునికీకరణ, చదువుకునే పిల్లలకు అమ్మఒడి, వసతి దీవెన, విద్యాదీవెన, గోరుముద్ద లాంటి పథకాలు ప్రభుత్వం అమలు చేస్తుందని మంత్రి వివరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీదేవి, మున్సిపల్ కమిషనర్ టి.శ్రీకాంత్‌రెడ్డి, మెప్మా సీవో ఇంత రాంజీ, పార్టీ పట్టణ కన్వీనర్ గాధంశెట్టి శ్రీధర్, పార్టీ నాయకులు మల్లిడి సత్తిరెడ్డి, కంచుమర్తి బాబూరావు, పోతంశెట్టి గోపాలకృష్ణ, సత్తిశంకర్‌రెడ్డి, అక్కల తాగూర్ పాల్గొన్నారు.

కచ్చితమైన సమాచారంతోనే పాఠశాల ప్రణాళిక



పాఠశాల ఆవాస ప్రాంత ప్రణాళిక తయారీపై సూచనలిస్తున్న డీఆర్పీ వెంకటేశ్వరరావు

రాయవరం: కచ్చితమైన సమాచారంతోనే పాఠశాల స్థాయిలో ఆవాస ప్రాంత ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంపీడీవో డి.శ్రీనివాస్, ఎంఈవో వై.సత్యనారాయణలు సూచించారు. రాయవరం మండల విద్యాశాఖాధికారి సమావేశపు హాలులో శనివారం ఆవాస ప్రాంత ప్రణాళికపై మండలంలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంపీడీవో శ్రీనివాస్, ఎంఈవో సత్యనారాయణలు మాట్లాడుతూ పాఠశాలల అవసరాల ఆధారంగా ప్రణాళికలను రూపొందించాలన్నారు. స్థానిక వనరులను ఆధారంగా చేసుకుని, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆవాస ప్రాంత ప్రణాళికలు రూపొందిస్తే, వాటి ఆధారంగా మండల స్థాయి ప్రణాళికను తయారు చేయాల్సి ఉంటుందన్నారు. అలాగే పాఠశాల అభివృద్ధి ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలన్నారు. ప్రణాళికలు ఏ విధంగా సిద్ధం చేసుకోవాలో డిస్ట్రిక్ట్ రీసోర్స్ పర్సన్ దాలిపర్తి వెంకటేశ్వరరావు హెచ్‌ఎంలకు వివరించారు. సమావేశంలో ఎంఐఎస్ కోఆర్డినేటర్ సత్తాడ రామారావు, సీఆర్పీలు కుంచే నీనాసిరి, వాసంశెట్టి సీతాధనలక్ష్మి, కిలపర్తి పోసిరాములు, వై.లక్ష్మీవీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

రేవతి సైన్స్ అవార్డు పోటీలు

రామచంద్రపురం: జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా ఈనెల 24న రేవతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ అధ్యక్షుడు కె.శ్రీకృష్ణ సాయి శనివారం స్థానిక విలేకరులకు తెలిపారు. ఏటా నిర్వహిస్తున్న ఈ సైన్స్ అవార్డు పోటీల్లో ఈసారి సైన్స్ అండ్ టాయ్స్ అనే అంశంపై విద్యార్థులకు పోటీ నిర్వహిస్తామని చెప్పారు. పోటీల్లో గెలుపొందిన వారికి నగదు బహుమతితో పాటు సైన్స్ బుక్స్, సైన్స్ కిట్స్ అందజేస్తామన్నారు. 6వ తరగతి నుంచి డిగ్రీ వరకు చదువుకునే బాలికలు ఈ పోటీలో పాల్గొనడానికి అర్హులని చెప్పారు. పూర్తి వివరాలకు 9866130320 ఫోన్ నెంబరులో సంప్రదించాలన్నారు.

ఇళ్ల నిర్మాణం చేపట్టాలి

కె.గంగవరం: లబ్ధిదారులు ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సాయంతో, ప్రభుత్వం తరపున అందిస్తున్న రుణాలతో ఇళ్ల నిర్మాణం చేపట్టాలని ఎంపీడీఓ ఎన్.శ్రీనివాస్ అన్నారు. మండల పరిధిలోని ఊడిమూడి గ్రామంలో శనివారం జగనన్న ఇళ్ల లబ్ధిదారులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ఇళ్ల స్థలాలు కేటాయించిన వారికి స్థలాలు చూపించామని చెప్పారు. లబ్ధిదారులు ప్రభుత్వ సాయాన్ని అందుకుని ఇళ్ల నిర్మాణ ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చంటి, సొసైటీ అధ్యక్షుడు సాదా వెంగళరావు, పంచాయితీ కార్యదర్శి ముద్రగడ చంటి తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయండి



ఇళ్ల నిర్మాణాల్ని పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి శివశంకరప్రసాద్

రాయవరం: జగనన్న లేఅవుట్లలో ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని డీఆర్‌డీఏ పీడీ, మండల ప్రత్యేకాధికారి శివశంకరప్రసాద్ అన్నారు. మండలంలోని చెల్లూరు గ్రామంలోని జగనన్న లేఅవుట్లను ఆయన పరిశీలించి, లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు.

గ్రామంలోని లేఅవుట్లలో 868 ఇళ్లు మంజూరు కాగా, ఇప్పటి వరకు 155 ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేశారన్నారు. మిగిలిన ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాల్సిందిగా ఆయన లబ్ధిదారులకు సూచించారు. ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాలకు అన్ని రకాలుగా ప్రోత్సాహం అందజేస్తుందన్నారు. సమావేశంలో ఎంపీడీవో డి.శ్రీనివాసు, హౌసింగ్ ఏఈ కొవ్వూరి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పాలనపై సంపూర్ణ విశ్వాసం



వెంటూరులో ప్రజల సమస్యలు వింటున్న ఎమ్మెల్సీ త్రిమూర్తులు

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- వెంటూరులో గడప గడపకూ మన ప్రభుత్వం

రాయవరం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై రాష్ట్ర ప్రజలకు సంపూర్ణ విశ్వాసముందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. మండలంలోని వెంటూరు గ్రామంలో శనివారం మధ్యాహ్నం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లిన ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు గత మూడున్నరేళ్లలో ప్రభుత్వం నుంచి ఆయా కుటుంబాలకు అందిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మాట్లాడుతూ జగనన్న పాలనలో పేదలకు ప్రతిరోజు పండగేనన్నారు. పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు పింఛన్లు ఈ నెల నుంచి రూ.2,750కు పెంచి అమలు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలతో లబ్ధి చేకూరిందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం నిత్యం ప్రజల పక్షాన నిలిచి వారి ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తుందని వివరించారు. సంక్షేమ పథకాలను అర్హులందరికీ పారదర్శకంగా అందించడమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమని చెప్పారు. సంక్షేమ పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల ఆశీస్సులు ఎప్పుడూ ఉండాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చిన్నం అపర్ణాపుల్లేష్, సర్పంచ్ వాసంశెట్టి వెంకట్రావు, ఉప సర్పంచ్ నున్న కృష్ణ ప్రదీప్‌కుమార్, వైస్ ఎంపీపీ గుబ్బల సుబ్రహ్మణ్యం, ఎంపీటీసీ వాసంశెట్టి రవికుమార్, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు ఆరిఫ్, పార్టీ ప్రచార కమిటీ జిల్లా కన్వీనర్ సిరిపురపు శ్రీనివాసరావు, సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ చిక్కాల శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

జోరుగా ద్వారపూడి రోడ్డు పనులు

బీటీ రోడ్డు పనులు ప్రారంభం



బీటీ రోడ్డు పనులు జరుగుతున్న దృశ్యం

మండపేట: ద్వారపూడి రోడ్డు పనులు జోరుగా జరుగుతున్నాయి. ఇప్పటికే దాదాపు సగం మేర సీసీ రోడ్డు నిర్మాణం పూర్తి కాగా తాజాగా బీటీ రోడ్డు పనులు ప్రారంభించారు. దీర్ఘకాలంగా మండపేట ప్రాంత ప్రజలను పట్టిపీడిస్తున్న ద్వారపూడి రోడ్డు సమస్య పరిష్కారానికి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ప్రత్యేక దృష్టిసారించారు. రోడ్డు పనుల ప్రగతిపై ఎప్పటికప్పుడు అధికారులతో చర్చించి పనులు ముందుకు సాగేలా చూస్తున్నారు. తాపేశ్వరం, ఇప్పనపాడు గ్రామాల్లో సీసీ రోడ్డు, ఇప్పనపాడు నుంచి ద్వారపూడి వంతెన వరకు బీటీ రోడ్డు నిర్మాణం చేయాల్సి ఉంది. ఈ మేరకు తాపేశ్వరం నుంచి ఇప్పనపాడు రైస్‌మిల్లు వరకు ఒక వైపు సీసీ రోడ్డు నిర్మాణం పూర్తి కాగా రెండో వైపు పనులు వేగవంతం చేశారు. తాజాగా ఇప్పనపాడు రైస్‌మిల్లు నుంచి చినద్వారపూడి వంతెన మీదుగా జెడ్ మేడపాడు వంతెన వరకు బీటీ రోడ్డు పనులు ప్రారంభించారు. మరో వారం రోజుల్లో బీటీ రోడ్డు పనులు పూర్తవుతాయని ఆర్‌అండ్‌బీ అధికారులు అంటున్నారు. ప్రస్తుతం 5.5 మీటర్లు ఉన్న రోడ్డును 7 నుంచి 10 మీటర్లు వరకు విస్తరిస్తున్నారు. బీటీ రోడ్డు నిర్మాణంలో నేపథ్యంలో రోడ్డులో ట్రాఫిక్ ఆంక్షలను కఠినతరం చేశారు. బయటి వాహనాలను ఈ రహదారిలోకి అనుమతించడం లేదు.

క్రీడల్లో గెలుపోటములు సమానమే

కాకినాడ డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న కాకినాడ డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి

కాజులూరు: క్రీడల్లో గెలుపోటములు సమానమేనని, ప్రతి ఓటమి పది విజయాలకు నాంది అవుతుందని కాకినాడ డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి అన్నారు. గొల్లపాలెం జెడ్పీ హైస్కూల్‌లో జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా జరుగుతున్న సంక్రాంతి సాంప్రదాయ ఆటల పోటీలు శనివారంతో ముగిశాయి. ఈ క్రీడల్లో వాలీబాల్ పోటీల్లో గొల్లపాలెం జట్టు గెలుపొందగా, కాజులూరు జట్టు రన్నర్‌గా నిలిచింది. ముగ్గుల పోటీల్లో జి.శ్రీదేవి, ఎం.హేమాంజలి, పి.స్వరుప, ఎ.లోవ, డి.వీరవెన్నెల తదితరులు బహుమతులు సాధించారు. పాఠశాలలో విద్యార్థులు భోగి మంటలు వేసి ముందస్తుగా సంక్రాంతి నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పోతురాజు ప్రసన్నమౌనిక, ఎస్‌ఐ ఎం.తులసీరామ్, వైఎస్సార్‌సీపీ మండల బీసీ సెల్ కన్వీనర్ గుబ్బల ఏసురాజు, స్కూల్ హెచ్‌ఎం వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియా కన్వీనర్లను నియమించాలి



సమావేశంలో పార్టీ నాయకులకు సూచనలిస్తున్న అధ్యక్షుడు చిట్టిబాబు

కె.గంగవరం: జిల్లాలో బీజేపీ తరపున సోషల్ మీడియా కన్వీనర్లు, కోకన్వీనర్ల నియామకం వెంటనే జరగాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రి చిట్టిబాబు అన్నారు. మండల పరిధిలోని కోటిపల్లిలో శనివారం బీజేపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ పార్టీ గ్రామ స్థాయిలో బలోపేతం చేయడానికి నాయకులు కార్యకర్తలు సంయుక్తంగా భాగస్వామ్యులు కావాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు వెంకట సుబ్బారావు, దూడల శంకరనారాయణ, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ రొక్కాల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.